సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 25 । జూన్ । 2023



# సాగు పనుల్లో రైతుల బిజీబిజీ

- జిల్లావ్యాప్తంగా కురుస్తున్న చిరుజల్లులు
- తొలకరితో ఊపందుకున్న సాగు
- విత్తనాలు వేయడంలో నిమగ్నమైన అన్నదాతలు


విత్తనాలు వేస్తున్న మహిళలు

సుల్తానాబాద్/కమాన్‌పూర్: ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడుతుండగా వరుణదేవుడు కరుణించినట్టు అయింది. ఆలస్యంగా చిరుజల్లులు కురిసినా ప్రజలు కొంత ఉపశమనం పొందారు. భారీ వర్షం పడకపోవడంతో ఉక్కపోత మాత్రం తగ్గలేదు. రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించడంతో పంట పొలాల్లో సందడి నెలకొంది.

**20రోజుల క్రితం నుంచే సన్నద్ధం**

వాస్తవానికి రైతులు వానాకాలం పంటల సాగుకు దాదాపు 20రోజుల క్రితం నుంచే సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్నుకొని విత్తనాలు తెచ్చిపెట్టుకున్నారు. జూన్ మొదటి వారంలోనే విత్తనాలు వేసుకోవాల్సి ఉండగా, మూడో వారం గడుస్తున్నా వానలు కురవకపోవటంతో ఆందోళనకు గురయ్యారు. అదను దాటుతుందని కలవరపడ్డారు. ఇంకోవైపు ప్రభుత్వం ముందస్తు సాగు విధానాన్ని తీసుకొచ్చింది. అకాల వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా సాగు సీజన్‌ను నెలరోజులు ముందుకు తెచ్చింది. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించింది. అయితే వానలు సకాలంలో కురవకపోవడంతో ముందస్తు పంటల సాగుకు అడ్డంకులు ఎదురయ్యాయి. తాజాగా నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**సాగు విస్తీర్ణం**

జిల్లాలో గత వానాకాలం కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. గత వానాకాలంలో జిల్లాలో 2,77,645 ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా, ఈసారి 2,83,321 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అధికారులు యోచిస్తున్నారు. 2,13,815 ఎకరాల్లో వరి, 65,000 ఎకరాల్లో పత్తి, మిగతా ఇతర పంటలు సాగు కానున్నాయి. ప్రస్తుతం చిరుజల్లులు కురుస్తుండడంతో పత్తి సాగు పనులు జోరందుకున్నాయి.

**తొలకరి మాటున రోగాలు..**

చిరుజల్లులు కురవడంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పువచ్చింది. దీంతో ఇన్నరోజులు ఎండ, వేడి, ఉక్కపోతతో సతమతమైన జనానికి ఉపశమనం లభించింది. కాగా తొలకరి మాటున రోగాలు ప్రబలుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. విషజ్వరాలతోపాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

### చిరుజల్లులతో పంటల సాగు



జిల్లావ్యాప్తంగా చిరుజల్లులు కురవడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యా యి. పత్తి పంటతోపాటు వ్యవసాయ బావుల వద్ద, చెరువుల కింద, నారుమడులు సిద్ధం చేసుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే విత్తనాలు మా ర్కెట్లో సిద్ధంగా ఉన్నాయి. తప్పనిసరిగా డీ లర్ల నుంచి రైతులు రశీదులు తీసుకోవాలి.

– ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

### వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం



చిరుజల్లులు కురవడంతో రైతులు, ప్రజలు ఎక్కడపడితే అక్కడ నీరు తాగవద్దు. వేడి చేసి చల్లారిన తర్వాతే నీరు తాగాలి. పలు రకాల విష జ్వరాలతో పాటు డయేరియా ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, జాగ్రత్తలు పాటిస్తే రోగాలు దరిచేరవు.

– ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

# మత్తు పదార్థాల నిర్మూలనపై సదస్సు


మాట్లాడుతున్న జడ్జి టి.శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సర్కస్ గ్రౌండ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల నిర్మూలనపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. గోదావరిఖని జిల్లా అదనపు న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలు, వాటిని ఎలా నిర్మూలించాలి..? బాధితులకు న్యాయ సేవలు ఎలా అందించాలి..? అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. మద్యపానం, పొగాకు, గుట్కా, గంజాయి, డ్రగ్స్‌వంటి అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, హెచ్‌ఎం సీహెచ్.ఇజ్రాయిల్, కళాశాల ప్రిన్సిపల్ ఎండీ.అబ్దుల్ రహీమ్, వన్‌టౌన్ ఎస్సై ఆర్.స్వామి, న్యాయవాదులు దాదాసలామ్, ప్రదీప్‌కుమార్, వరలక్ష్మి పాల్గొన్నారు

# ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్: ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు సూచించారు. శనివారం సుల్తానాబాద్‌లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పద్మశాలీలకు విధించిన జీఎస్టీని ఎత్తివేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, కొత్తగా ఇల్లు కట్టుకునేందుకు రూ.5, లక్షలు, నిరుద్యోగ యువతకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తుందన్నారు. గరిగె శ్రీనివాస్, మాజీ సర్పంచులు అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్‌రావు, దన్నాయక్ దామోదర్‌రావు, కుమార్ కిషోర్, సాయిరి మహేందర్, పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్, మండల అధ్యక్షుడు చిలుక సతీష్, నోముల శ్రీనివాస్‌రెడ్డి, దున్నపోతుల రాజయ్య, అమిరిశెట్టి రాయలింగు, తిరుపతి, ఎండీ.నిషాద్, రఫిక్, చింతల సునీత, రాజు, అశోక్, రమేశ్ పాల్గొన్నారు.

# కూనారంలో వ్యవసాయ కళాశాలకు వినతి


కాసులపల్లి రైతుల సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం వ్యవసాయ పరిశోధనాకేంద్రంలో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. కూనారంలో కళాశాలను ఏర్పాటు చేసి డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, హార్టికల్చర్, పౌల్ట్రీ, డైయిరీ టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ కోర్సులను అందుబాటులోకి తేవాలని కోరారు. దీనికి సీఎం కేసీఆర్, నిరంజన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

**భూయాజమాన్య హక్కులు కల్పించాలి**

పెద్దపల్లిరూరల్: ముత్తారం రంగనాయకస్వామి ఆలయ భూములను సేద్యం చేసుకుంటున్న వారికే హక్కులు కల్పించాలని పెద్దపల్లి మండలం పాలితం రెవెన్యూ శివారు (కాసులపల్లి, గోపయ్యపల్లి) రైతులు కోరారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, దాసరి వెంకటరమణారెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు ఇనుగాల తిరుపతిరెడ్డి తదితర రైతులు శనివారం రెవెన్యూశాఖ చీఫ్ సెక్రటరీ భూపాల్‌రెడ్డిని కలిశారు. వందేళ్ల నుంచి సాగుచేసుకుంటున్న భూములపై యజమాన్య హక్కులు కల్పించి రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు. గతంలో తొలగించిన పట్టాలను పునరుద్ధరించి భూ యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. స్పందించిన ఆయన సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారని రైతులు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, తదితరులు ఉన్నారు.


కూతురును కొత్తపల్లి హైస్కూల్‌లో దింపుతున్న సదానందం

## చిన్నచూపు తొలగాలని..

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ రేకుర్తిలో నివసిస్తున్న కొడికాల సదానందం దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితుడు. కూతురు కొడికాల చతురను ప్రభుత్వపాఠశాలలో చదివించాలని భావించారు. కొత్తపల్లి జెడ్పీపాఠశాలలో ఏడో తరగతిలో ప్రవేశం పొందిన చతుర ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. దివ్యాంగుడైన సదానందం నిత్యం చతురను పాఠశాలలో దింపి ఉద్యోగానికి వెళ్తారు. సాయంత్రం ఇంటికి తీసుకెళ్తారు. ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు తొలగాలని తన కూతురిని ఇక్కడ చదివిస్తున్నట్లు సదానందం వెల్లడించారు.

- మెరుగైన బోధన.. కార్పొరేట్ సౌకర్యాలు
- ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు

సండే స్పెషల్

# ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల పిల్లలు

సర్కారీ బడికే జై కొడుతున్నారు ప్రభుత్వ టీచర్లు. ఇంగ్లిష్ మీడియంలో బోధన.. కార్పొరేట్‌కు దీటైన వసతులు ఆకర్షితులను చేస్తున్నాయి. ప్రైవేట్‌కు పంపే స్థోమత ఉన్నా.. ప్రభుత్వ టీచర్లు తమ పిల్లలను సర్కార్ బడిలో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ బడిలో కల్పిస్తున్న సౌకర్యాలు.. విద్యాబోధన గురించి తమ పిల్లల ద్వారానే వివరిస్తూ మిగతా వారిని ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం 'మన ఊరు – మన బడి', 'మన బస్తీ – మన పాఠశాల' పేరుతో సౌకర్యాలు మెరుగుపరచడం.. యూనిఫాం.. పుస్తకాలు.. నోట్‌బుక్స్.. రుచికర మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తుండడం ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడికి మళ్లేలా చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదవిస్తున్న ఆదర్శ ఉపాధ్యాయులపై ఈ వారం సండే స్పెషల్..

## సర్కారుబడి తక్కువేం కాదు


కొడుకు అభిజ్ఞతో భారతి

కోరుట్ల: మండలంలోని ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాల టీచర్లు రాజు, భారతి పిల్లలను తాము పని చేసే బడిలోనే చదివిస్తున్నారు. రాజు పెద్ద కొడుకు సిద్ధసాయి 5వతరగతి, చిన్న కొడుకు విశ్వ 1వ తరగతి, భారతి కొడుకు అభిజ్ఞ 4వ తరగతి చదువుతున్నారు. పిల్లలను సర్కారు బడిలోనే చదివించడంలో నామోషీలేదని, పోటీపడి డీఎస్సీలో ప్రతిభ చూపామని, తమపై తమకు నమ్మకం ఉందని చెబుతున్నారు. తాము చదువు చెప్పే బడిలోనే తమ పిల్లలను చదివిస్తే ఊర్లోని తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుందని వివరించారు. సర్కార్ బడిలోనే తమ పిల్లలను చదివిస్తే భవిష్యత్ బాగుంటుందని పేర్కొన్నారు.


తిమ్మాపూర్ పాఠశాలలో కూతుర్ని దింపుతున్న శ్రీలత

## దీటైన చదువులు

చందుర్తి: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన కాపిల్ల శ్రీలత– నరేశ్ దంపతులు ప్రభుత్వ టీచర్లు. నరేశ్ కోనరావుపేట మండలం పల్లిమక్తలో, శ్రీలత ఆశిరెడ్డిపల్లెలో పనిచేస్తున్నారు. తిమ్మాపూర్‌లోనే నివాసముంటూ కూతురు సహస్రాన్వితను స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదివిస్తున్నారు. చందుర్తికి చెందిన బండ శంకర్ రామన్నపేటలో ఉపాధ్యాయుడు. కూతురు బండ సింధు చందుర్తి జెడ్పీ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. కొడుకు ఆశీష్ చందుర్తి ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు.

## ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలకు..



ఎల్లారెడ్డిపేట:మండలంలోని దుమాలలో పనిచేస్తున్న మంతుర్తి రామచంద్రం కూతురు సహజను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదోతరగతి వరకు చదివించారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందుతుందనే సంకేతాన్ని తెలియజేయడానికి ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీ పాఠశాలలో ఆరోతరగతిలో చేర్పించాడు. ఎలగందుల దేవరాజు అనే ప్రధానోపాధ్యాయుడు సైతం తన ఇద్దరు పిల్లలను తాను పనిచేసే పాఠశాలలో చదివించగా.. ఇటీవలి పదోతరగతి ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించారు.

## ప్రభుత్వ చదువులే బెస్ట్


తమ పిల్లలతో నవీన్‌కుమార్– స్వర్ణలత

జగిత్యాల: జిల్లాలోని మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన జక్కుల నవీన్‌కుమార్– స్వర్ణలత దంపతులు ఎస్జీటీలు. ప్రస్తుతం కోరుట్లలో నివాసముంటున్నారు. స్వర్ణలత కోరుట్ల మండలం ధర్మారం ఎంపీయూపీఎస్‌లో, నవీన్‌కుమార్ మల్లాపూర్ మండలం వేంపల్లిలో పనిచేస్తున్నారు. వీరికి నిత్యశ్రీ, అన్విక ఇద్దరు కుమార్తెలున్నారు. స్వర్ణలత పనిచేస్తున్న స్కూల్‌లోనే నిత్యశ్రీ నాల్గో తరగతి, అన్విక ఫస్ట్‌క్లాస్ చదువుతున్నారు. పాఠశాలల్లోనే క్వాలిటీ చదువు ఉందని, ఇంగ్లిష్ మీడియం అందుతోందని, అందుకే తమ పిల్లలను ఇక్కడే చదివిస్తున్నట్లు వివరించారు.

## తనతో పాటే ఇద్దరు పిల్లలు..

కాల్వశ్రీరాంపూర్: మడిపెల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఎస్జీటీ ఎనగంటి కవిత తన వృత్తికే ఆదర్శంగా నిలుస్తోంది. భర్త చిలువేరు సదాశివ మండలంలోని చందపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు. కవిత ఏడేళ్ల క్రితం కథలాపూర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. వచ్చిన కొత్తలో పాఠశాలలో 21మంది పిల్లలే ఉండడంతో సంఖ్య పెంచేందుకు తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. సౌకర్యాలను వివరించారు. సర్పంచ్, పాలకవర్గ సభ్యుల పిల్లలను బడిలో చేర్పించేలా కృషిచేశారు. కవిత సైతం తన పిల్లలు మహ (5వ తరగతి), మను (1వ తరగతి)ని తాను పనిచేసే పాఠశాలలోనే చదివిస్తున్నరు. తనతో పాటు స్కూటీపై తీసుకొచ్చి, తీసుకెళ్తోంది. ఇప్పుడు పాఠశాలలో 40 మంది వరకు పిల్లలు చదువుతున్నారు.


తన పిల్లలతో పాఠశాలకు వస్తున్న ఎనగంటి కవిత


తన ఇద్దరు పిల్లలు శ్రావ్య, శ్రావణితో శ్రీనివాస్

## తండ్రీకూతుళ్లు.. సర్కారు బడికే..

గోదావరిఖనిటౌన్: రామగుండం పరిధిలోని జనగామ జిల్లాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు టి.శ్రీనివాస్ తన ఇద్దరు కూతుళ్ల శ్రావ్య, శ్రావణిని ఆదే పాఠశాలలో 8వ తరగతి చదివిస్తున్నారు. మంథని ముత్తారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ సైతం ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివారు. తన కూతుళ్లను సైతం తాను బోధించే పాఠశాలలోనే చదివిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు బాగుంటాయని, అందుకే తన పిల్లలనూ ఇక్కడే చదివిస్తున్నట్లు వివరించాడు.

## తండ్రితో కొడుకు

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు హరికృష్ణ తన ఇద్దరు పిల్లలను అదే పాఠశాలలో చదివిస్తున్నారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న హన్మాజిపేటకు చెందిన తీగల నాగరాజు, వట్టిమల్ల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న హన్మాజిపేటకు చెందిన నందిని దంపతుల పిల్లలు ప్రణవి, విశ్వక్‌వర్ధన్‌ను స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు.


హన్మాజిపేటలో తన కొడుకును పాఠశాలకు తీసుకెళ్తున్న టీచర్

## తల్లి వెంట తనయ


తరగతి గదిలో తల్లిజయతో కూతురు తేజశ్రీ

రామగుండం: రామగుండం మండల పరిషత్ పాఠశాలలో మ్యాథమెటిక్స్/తెలుగు బోధించే ఆడెపు జయ తన కూతురు తేజశ్రీని ఇదే స్కూల్‌లో చదివిస్తున్నారు. భర్త సత్యనారాయణ సింగరేణి ఉద్యోగి. జయకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురును సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదివించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతోంది. చిన్న కూతురు తేజశ్రీకి రెండోతరగతిలో ప్రవేశం కల్పించగా ప్రస్తుతం ఐదోతరగతి చదువుతోంది. తాను సైతం చిన్నప్పటి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే విద్యాభ్యాసం చేశానని, ప్రభుత్వ పాఠశాలలోనే ఉద్యోగం చేస్తున్నానని, పిల్లలనూ ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జయ వివరించారు.

## తాను చదివిన స్కూల్‌లోనే


పాఠశాలలో కొడుకు విద్యావర్ధన్‌చారితో దేవేంద్రాచారి దంపతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన వోజు దేవేంద్రాచారి కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు. దేవేంద్రాచారి, శశికళ దంపతులకు అక్షరప్రియ, విద్యావర్ధన్‌చారి పిల్లలు. వీరిద్దరిని చీకోడు ప్రాథమిక పాఠశాలలోనే నర్సరీలోనే చేర్పించారు. అక్షర ప్రియ ఐదో తరగతి, విద్యావర్ధన్‌చారి మూడో తరగతి చదువుతున్నారు. తానూ చీకోడు ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఉపాధ్యాయుడిగా ఎదిగానని, అదే పాఠశాలలో పిల్లలిద్దరిని చేర్పించానని దేవేంద్రచారి పేర్కొన్నారు.


స్కూటీపై కొడుకును స్కూలుకు తీసుకొచ్చిన టీచర్ శారద

## ఆదర్శ దంపతులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీకి చెందిన అనిల్– శారద ప్రభుత్వ టీచర్లు. అనిల్ హరిపురం ముత్తారంలో, శారద రామగుండం మండలం నరసింహపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. శారద పనిచేసే పాఠశాలలోనే పెద్దకొడుకు శ్రీహన్‌ను ఒకటోతరగతిలో చేర్పించారు. ప్రస్తుతం మూడోతరగతి చదువుతున్నాడు. రెండోకొడుకునూ త్వరలోనే ప్రభుత్వపాఠశాలకు పంపిస్తామని అనిల్– శారద దంపతులు తెలిపారు.


పిల్లలను పాఠశాలకు తీసుకెళ్తున్న రాజనర్సయ్య

## నలుగురు పిల్లలు సర్కారు బడికే..

మెట్‌పల్లి: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన పొట్ట రాజనర్సయ్య–స్వాతి దంపతులకు నలుగురు పిల్లలు. ముగ్గురు కొడుకులు రాజేంద్ర, రాజలింగం, రాజన్, కూతురు రాజలక్ష్మి రాజనర్సయ్య పట్టణ పరిధిలోని ప్రియదర్శిని కాలనీ ప్రాథమికపాఠశాలలో ఉపాధ్యాయుడు. తన పిల్లలను మొదటి నుంచీ స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నాడు. ప్రస్తుతం పెద్దకొడుకు ప్రభుత్వ కళాశాల నుంచి ఇంటర్ పూర్తి చేశాడు. రెండో కొడుకు అదే కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మూడో కొడుకు, కూతురు చావిడి వద్ద ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిది, ఆరోతరగతి చదువుతున్నారు. తనకు చదువు చెప్పిన గురువుల పిల్లలూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించారని, వారిని స్ఫూర్తిగా తీసుకున్నట్లు రాజనర్సయ్య వివరించారు.

## ఉద్యోగం చేసేచోటే..


పిల్లలను పాఠశాలకు తీసుకొస్తున్న వెంకటేశ్వర్లు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కరంకొండ వెంకటేశ్వర్లు పదేళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇతని పిల్లలు రాకేశ్ 8వ తరగతి, కూతురు జీవణి 7వ తరగతి మొదటి నుంచి కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. నిత్యం తనతో పాటు స్కూల్‌కు తీసుకొచ్చి.. తనతో పాటే సాయంత్రం ఇంటికి తీసుకెళ్తాడు వెంకటేశ్వర్లు.


కొత్తగట్టు పాఠశాలలో కొడుకుతో శ్రీనివాస్

## చిన్నప్పటి నుంచే..

శంకరపట్నం: హుజూరాబాద్‌లో నివాసం ఉండే బోడ శ్రీనివాస్ ఎస్జీటీ. ప్రస్తుతం మండలంలోని రాజాపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని మెట్‌పల్లిలో పనిచేసినప్పుడే తన కొడుకు సుశాంత్‌ను తను విధులు నిర్వహించే పాఠశాలలోనే ఒకటో తరగతిలో చేర్పించారు. తనతోపాటు బైక్‌పై కొడుకును తీసుకొచ్చేవారు. డిప్యూటేషన్‌పై కొత్తగట్టుపాఠశాలకు వెళ్లడంతో సుశాంత్‌ను సైతం కొత్తగట్టులో చేర్పించారు. ఇప్పుడు బదిలీపై రాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లడంతో 9వ తరగతి చదివే సుశాంత్‌ను నిత్యం కొత్తగట్టు పాఠశాలలో దింపి విధులకు వెళ్తున్నారు.

## క్లుప్తంగా

### ఆదివరాహస్వామి సేవలో మెదక్ ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

**కమాన్‌పూర్(మంథని):** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీఆదివరాహస్వామికి అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ఇనగంటి ప్రేమలత పద్మకు స్వామి తీర్థప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. ఎంపీపీ రాసకొండ లక్ష్మి, బీ ఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్, ఉప సర్పంచ్ సాయి, ఆలయ డైరెక్టర్లు పిడుగు అంజి, కొలిపాక లక్ష్మి శాలువాలతో సన్మానించారు.

### సెక్యూరిటీ సిబ్బందితో హమాలీ పని



కార్గో వాహనం నుంచి సామగ్రి తరలిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

**కోల్‌సిటీ(రామగుండం):** గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న సిబ్బందితో అధికారులు హమాలీ పని చేయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల ఓ సెక్యూరిటీ గార్డు ఓ వాహనంలో వచ్చిన సామగ్రిని ఆస్పత్రిలోకి తరలిస్తుండగా కాలుకు గాయమైందని తెలిసింది. సెక్యూరిటీ సిబ్బందితో ఇలాంటి పనులు చేయించడం ద్వారా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే ఎక్కడ ఉద్యోగం నుంచి తొలగిస్తారోనని భయంతో అధికారులు చెప్పిన పని చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

### బల్దియాలో అధికార పార్టీ కార్పొరేటర్ల భేటీ

**కోల్‌సిటీ(రామగుండం):** రామగుండం నగరపాలక సంస్థలోని అధికార పార్టీలో గ్రూపు రాజకీయలు జోరుగా సాగుతున్నాయి. రెండు గ్రూపులుగా విడిపోయిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం 23 మందితో రహస్యంగా సమావేశం అయిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ మీటింగ్‌లో కార్పొరేటర్ల ఫోరంపై కూడా పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో శనివారం రెండు గ్రూపుల కార్పొరేటర్లు చర్చలు జరుపుకోవడం గమనార్హం. డివిజన్లలో అభివృద్ధి పనులు వేగంగా జరగడానికి ఐక్యంగా ఉండాలని పలువురు కార్పొరేటర్లు కోరినట్లు తెలిసింది. కాగా ఆదివారం మరోసారి ఎన్టీపీసీలో 23 మంది కార్పొరేటర్లు రహస్యంగా సమావేశం కావడానికి ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం.



## జీజీహెచ్‌కు నీలోఫర్ నుంచి సేవలు

- నవజాత శిశువుల వైద్యానికి ప్రొఫెసర్ల సూచనలు
- ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు



సేవల తీరును వీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ

**కోల్‌సిటీ(రామగుండం):** గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని నవజాత శిశు సంరక్షణ కేంద్రం(ఎస్‌ఎన్‌సీయూ)లో శిశువులకు మెరుగైన వైద్యం అందించడానికి హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రి నుంచి సూచనలు, సలహాలు అందనున్నాయి. ఈ మేరకు నీలోఫర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీని శనివారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు ప్రారంభించారు. జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృపాబాయి, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దీన్‌దయాల్ పాల్గొన్నారు. నీలోఫర్ ఆస్పత్రిలోని నియోనాటల్ డాక్టర్లు పర్యవేక్షించనున్నారని డీఎంహెచ్‌ఓ వెల్లడించారు. ఎస్‌ఎన్‌సీయూ వార్డులోని బరువు తక్కువ, ఇతర అనారోగ్య సమస్యలున్న శిశువుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం, మెడికల్ రిపోర్టులను వీడియో కాల్ ద్వారా ప్రొఫెసర్లు పరిశీలించి మెరుగైన వైద్యం అందించాల్సిన తీరుపై సూచనలు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ అశోక్, ఐటీ మేనేజర్ మహేందర్, పీడియాట్రిషన్ హెచ్‌ఓడీ శిరోమణి, శ్రీలత, ఆదిశ్‌రెడ్డి, స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## ట్రినిటీలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు స్పందన



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ప్లేస్‌మెంట్ అధికారులు

**పెద్దపల్లిరూరల్:** జిల్లాకేంద్రంలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగమేళాకు స్పందన లభించింది. బీ టెక్, ఎంబీఏ పాసైన సుమారు 350 విద్యార్థులు పాల్గొన్నారు. 25కి పైగా బహుళ జాతీయ కంపెనీలు పాల్గొని వివిధ రకాల, కంప్యూటర్ కోడింగ్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, గ్రూప్ డి స్కషన్, మౌఖిక పరీక్ష, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలో ఏటా ప్లేస్‌మెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అకడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్, ప్రి న్సిపల్ మణి గణేష్, ఏవో సురేశ్ పాల్గొన్నారు.

## వేతన ఒప్పందం అమలు చేయకుంటే ఉద్యమం



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

**జ్యోతినగర్(రామగుండం):** మహారత్న ఎన్టీపీసీలో కార్మికులకు వేతన కష్టాలు పెరిగిపోయాయని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు పేర్కొన్నారు. శనివారం ప్రాజెక్టు లేబర్ గేట్ నుంచి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త వేతన ఒప్పందం అమలు చేయాలని నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా స్పందించడం లేదని, నిరవధిక సమ్మెలోకి వెళ్లే క్రమంలో ఉద్యమం మరింత ఉధృతం చేయక తప్పదని పేర్కొన్నారు. కార్మికులు తమ హక్కులను సాధించుకునేందుకు గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లక తప్పదని, యాజమాన్యం గ్రహించాలని సూచించారు. ఈనెల 30 తర్వాత ఏ క్షణమైనా సమ్మెలోకి వెళ్లేందుకు కార్మికులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, రాదారపు రాజమల్లయ్య, ఇజ్జగిరి భూమయ్య, సత్యం, రాజిరెడ్డి, లక్ష్మణ్, ఎం.శంకర్, చంద్రయ్య, శ్రీనివాస్, గీట్ల లక్ష్మారెడ్డి, బుచ్చన్న, రాఘవరెడ్డి, అధిక సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## ‘టూరిస్టు సీఎంగా వ్యవహరిస్తున్న కేసీఆర్’



డాక్టర్ నగేశ్

**ధర్మారం(ధర్మపురి):** తెలంగాణలో జీతం తీసుకుంటూ మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో పర్యటిస్తూ టూరిస్టు సీఎంగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ ఆరోపించారు. శనివారం ధర్మారంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర నిధులతో జీతం తీసుకుంటూ మహారాష్ట్రలో అధికారికంగా పర్యటించి రాష్ట్ర ఖజానాను దుర్వినియోగం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. అంతే కాకుండా ఇక్కడి నిధులతో ఇతర రాష్ట్రాల ప్రజలకు లబ్ధి చేకూర్చడం ఎంతవరకు సమంజసమన్నారు. నెలకు రూ.4 లక్షల జీతం తీసుకుంటూ ఇతర రాష్ట్రాల్లో పర్యటించి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతం కోసం తెలంగాణ వనరులను ఇతర రాష్ట్రాలకు కేటాయించటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. సమావేశంలో సంపత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అందుకున్న శ్రావణ్ కుమార్



తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అందుకుంటున్న శ్రావణ్ కుమార్

**యైటింక్లయిన్‌కాలనీ:** సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ అందుకున్నారు. శనివారం సాయిశివాని కల్చరల్ అండ్ ఒకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ పద్మజాదేవి ఆధ్వర్యంలో వరంగల్‌లో సత్య కన్వెన్షన్‌లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అల్ ఎన్‌జీఓఎస్ నిర్వహించిన గెట్‌టుగెదర్‌లో రికార్డులు అందించారు. ఇందులో భాగంగా సదాశయ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ 14 ఏళ్ల నుంచి నేత్ర, శరీర, ఆవయవదానాలపై చేస్తున్న కృషిని గుర్తించి శ్రవణ్‌కుమార్‌కు సర్టిఫికెట్ అందించి అభినందించారు. శ్రావణ్ కుమార్ రికార్డు అందుకోవడంపై ఫౌండేషన్ ప్రతి నిధులు లింగమూర్తి, రాజిరెడ్డి, రమేశ్, రామకృష్ణారెడ్డి, భీష్మాచారి, రాజమౌళి, చంద్రమౌళి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రతిఒక్కరూ క్విజ్ పోటీలో పాల్గొనండి



మాట్లాడుతున్న సంపత్

**మంథని:** యువతలోని మేధోశక్తిని పెంచడానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తిప్పారపు సంపత్ కోరారు. శనివారం మంథనిలోని ఎమ్మెల్యే నివాసంలో యువజన కాంగ్రెస్ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికలకు ఎలా సమాయత్తం కావాలో శ్రేణులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండల, గ్రామ కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు జెమినిగౌడ్, మంథని నియోజకవర్గ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, నాయకులు ఎరుకల ప్రవీణ్, పూదరి చంద్రశేఖర్, నయీమొద్దీన్, కొప్పుల గణపతి, సునీల్‌గౌడ్, ఆర్ల నాగరాజు, కిరణ్‌గౌడ్, శివ తదితరులు ఉన్నారు.

## రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

**గోదావరిఖని(రామగుండం):** సింగరేణి మాజీ సెక్యూరిటీ గార్డు శనివారం ఆర్జీ–1 జీఎం చాంబర్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. క్వార్టర్ సర్టిఫికెట్ ఇచ్చి గ్రాడ్యూటీ చెల్లించాలని రిటైర్డ్ సెక్యూరిటీ గార్డు ఆవుల చంద్రశేఖర్ ఏడాదిన్నర కాలంగా జీఎం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఈక్రమంలో శనివారం జీఎం కార్యాలనికి వచ్చిన అతడు ముందుగా డీజీఎం పర్సనల్ వద్దకు వెళ్లి సమస్య వివరించాడు. తర్వాత జీఎంను కలిసే ప్రయత్నంలో టాబ్లెట్లు, ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది చంద్రశేఖర్‌ను హుటాహుటిన సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏలాంటి ప్రాణాపాయం లేదని డాక్టర్లు తెలిపారు.

**క్వార్టర్ పక్కన అక్రమ నిర్మాణం**

చంద్రశేఖర్ సింగరేణి క్వార్టర్ పక్కన అక్రమ నిర్మాణం చేపట్టాడని వాటిని తొలగించాలని కోరామని ఆర్జీ–1 అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణ తెలిపారు. అక్రమ నిర్మాణాల మూలంగా క్వార్టర్లు వేరే వారికి కేటాయించడం ఇబ్బందిగా మారిందన్నారు. అక్రమ నిర్మాణం తొలగిస్తే క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పినట్లు తెలిపారు.

## సింగరేణిలో పది మంది మైనింగ్ అధికారుల బదిలీ

గోదావరిఖని: సింగరేణిలో పదిమంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం శనివారం ఆదేశాలు జారీ చేసింది. వచ్చేనెల 4లోగా బదిలీ స్థానాల్లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

| అధికారి | హోదా | ప్రస్తుతం | బదిలీ |
|---|---|---|---|
| జి.నాగేశ్వర్‌రావు | అడిషనల్ జీఎం | మణుగూరు | ఎస్‌ఓటూడైరెక్టర్(పీఅండ్‌పీ) |
| కె.రఘుకుమార్ | అడిషనల్ జీఎం | కార్పొరేట్ | ఎస్‌ఓటూ జీఎం ఎస్‌ఆర్‌పీ |
| వీసం కృష్ణయ్య | అడిషనల్ జీఎం | ఆర్‌అండ్‌డీ | ఎస్‌ఓటూ జీఎం, మణుగూరు |
| నరేందర్ | డీవైజీఎం | ఓసీపీ-2 పీఓ | ఓస్‌ఓటూ జీఎం, బెల్లంపల్లి |
| పి.వీరభద్రారావు | డీవైజీఎం | క్వాలిటీకార్పొరేట్ | ఏఓ, యూజీ, మణుగూరు |
| కూర్మ రాజేందర్ | అ.మేనేజర్ | ఏఓ, కాసిపేట | ఓసీపీ-2, ఆర్జీ-3 |
| టి.వినోద్‌కుమార్ | అ.మేనేజర్ | ఎన్విరాన్ | క్వాలిటీ, కార్పొరేట్ |
| కె.వెంకటేశ్వర్లు | అ.మేనేజర్ | ఎంఓసీ, న్యూఢిల్లీ | ఎస్టేట్, కార్పొరేట్ |
| మనోజ్‌కుమార్ | అ.మేనేజర్ | కేఓసీపీ | కేటీకే-5భూపాల్‌పల్లి |
| ఎ.శ్రీకాంత్ | డిప్యూటీమేనేజర్ | కేకే-5 | కే.ఓసీపీ ఇల్లెందు |

### ఎస్సీకాలనీ ఖాళీ చేయాలి

**యైటింక్లయిన్‌కాలనీ:** సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం చందనపూర్ ఎస్సీకాలనీవాసులు వారి ఇళ్లను ఖాళీ చేయాలని మంథని ఆర్డీవో వీరబ్రహ్మాచారి అన్నారు. శనివారం తహసీల్దార్ రామ్మోహన్, ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్‌తో కలసి గ్రామస్తులతో సమావేశమయ్యారు. జీడీకే–11 ఇంక్‌లైన్ భూగర్భగనుల పనుల పురోగతి, బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలగకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సీకాలనీ అత్యవసరంగా ఖాళీ చేయాలని సూచించారు. వారికి అన్ని విధాలా పరిహారం చెల్లించామని పేర్కొన్నారు. మిగతా వారికోసం ఆర్‌అండ్‌ఆర్ అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఆర్జీ–1 జీఎం మాట్లాడుతూ గ్రామస్తులకు అన్ని సదుపాయలు కల్పిస్తామన్నారు. సర్వే ఆఫీసర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### స్థలం కేటాయించాలి

**గోదావరిఖని(రామగుండం):** హిందూ శ్మశానవాటికకు పదెకరాల స్థలం కేటాయించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ–1 జీఎం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. హిందూ శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించడంలో మీనమేషాలు లెక్కిస్తున్న సింగరేణి యాజమాన్యం ముస్లింలు ఖబరస్తాన్‌ల పేరుతో ఎకరాల స్థలం ఆక్రమించుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, ఇసంపెల్లి వెంకన్న, మోడెం సురేందర్, హిందువాహిని రాష్ట్ర కార్యదర్శి పైతరి రాజు తదితరులున్నారు.

### సీఐని అభినందించిన డీజీపీ



స్టార్ పెడుతున్న డీజీపీ అంజన్‌కుమార్

**గోదావరిఖని(రామగుండం):** ఎస్‌ఐ నుంచి సీఐగా పదోన్నతి పొందిన శ్రీనివాస్‌ను డీజీపీ అంజన్‌కుమార్ అభినందించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి ఫింగర్‌ప్రింట్ యూనిట్ సీఐగా వోడ్నాల శ్రీనివాస్ పదోన్నతి పొందారు. ఈసందర్భంగా స్టార్ అలంకరించారు. అడిషనల్ డీజీపీ మహేశ్‌భగవత్, ఫింగర్ ప్రింట్ డైరెక్టర్ తాతారావు తదితరులున్నారు.

### పంట భూములను పాడు చేయొద్దు

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో రైల్వే అండర్‌బ్రిడ్జి కోసం పంటలు సాగు చేసే భూముల్లో మట్టిపోయడం సరికాదని రైతులు విజయ, లక్ష్మి, నరేశ్, రాజేశ్వరి రామగుండంలోని రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఉపాధ్యాయ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. తమకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా తమ పంటభూములను ఆక్రమించుకోవడం అన్యాయమని, వెంటనే పనులు ఆపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### వాహనాలు సీజ్

**పాలకుర్తి:** మండలంలోని జీడీనగర్ శివారు కన్నాల బోడగుట్ట క్రషర్ల సమీపం నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను తహసీల్దార్ సునీత శనివారం రాత్రి సీజ్‌చేశారు. మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దార్‌తోపాటు ఆర్‌ఐ భానుకుమార్ తమ సిబ్బందితో వెళ్లారు. మట్టిని లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్, టిప్పర్‌ను సీజ్ చేసి బసంత్‌నగర్ పోలీసులకు అప్పగించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

### ఆర్డీవోను కలిసిన ఆర్జీ-3 జీఎం

**కమాన్‌పూర్(రామగిరి):** ఆర్జీ–3 జీఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జీఎం ఎస్.సుధాకర్‌రావు శనివారం మంథని ఆర్డీవో వీరబ్రహ్మాచారిని మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ చేపట్టే విస్తరణ పనులకు రెవెన్యూపరంగా సహాయసహకారాలు అందించాలని కోరారు. జీఎం వెంట అధికారులు రవీందర్, జైనుల్లాబద్దీన్, ఐలయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

### మదర్‌థెరిసాలో రేపు లీగల్ లిటరసీ క్యాంపు

**పెద్దపల్లిరూరల్:** జిల్లాకేంద్రంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కాలేజీలో ఈనెల 26న న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తారని, బాధితులకు అందించే న్యాయ సేవలు, డ్రగ్స్ నిర్మూలనకు చేపట్టే చర్యలు, లీగల్ సర్వీసెస్ సేవలపై సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### జూలై 6నుంచి సమ్మె

**పెద్దపల్లిరూరల్:** పంచాయతీల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, జూలై 6నుంచి సమ్మెకు దిగుతున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో శనివారం సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నా యకులు తిరుపతి, అశోక్ తదితరులున్నారు.

### వచ్చేనెల 7న ఎన్టీపీసీ జ్యోతిక క్లబ్ ఎన్నికలు

**జ్యోతినగర్:** ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిక వేల్ఫేర్ అసోసియేషన్‌కు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అసోసియేషన్‌కు ఫిబ్రవరిలో గడువు ముగిసింది. ఎన్నికలు నిర్వహించకపోవడంతో ‘జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ ఎన్నికలు ఎప్పుడో..?’ శీర్షికన గతనెల 19న ‘సాక్షి’ కథనం ప్రచురించింది. స్పందించిన ఎన్టీపీసీ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. జూలై 7 ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్, కమిటీ మెంబర్లు ముగ్గురిని ఎన్నుకునేందుకు నామినేషన్ల ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఈనెల 26 వరకు నామినేషన్ల స్వీకరణ, 27న పరిశీలన, 28న విత్‌డ్రా అనంతరం తుది జాబితా విడుదల, పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం, జూలై 6న ప్రచారం ముగింపు, 7న ఉదయం 5:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, 5 గంటల తర్వాత లెక్కింపు, ఫలితాల ప్రకట న ఉంటుందని ఎన్నికల అధికారులు సుధాకర్ పంజాల, అధికారులు సమంత, ఎస్‌ఎస్.సుందరం ఉత్తర్వులు విడుదల చేశారు.

### వకీల్‌పల్లి గని సందర్శన

**గోదావరిఖని(రామగుండం):** వకీల్‌పల్లి గనిని కార్పొరేట్ సేఫ్టీ కమిటీ శనివారం సందర్శించింది. గనిలో రక్షణ చర్యలు, ఉత్పత్తి, ఉత్పాదకతపై చర్చించారు. గనిలోని కంటిన్యూస్ మైనర్, ఎల్‌హెచ్‌డీ పనిస్థలాలను సందర్శించారు. గనిలో రక్షణతో ముందుకు సాగాలన్నారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

## నేత్రదానం చేసిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు



వెంకటి నేత్రాలు దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

**కోల్‌సిటీ(రామగుండం):** గోదావరిఖని మేదరిబస్తీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మెరుగు వెంకటి (83) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో మృతిచెందాడు. ఈసందర్భంగా వెంకటి కుటుంబ సభ్యులు సమాజహితం కోసం ఆయన నేత్రాలను ఐ బ్యాంక్‌కు దానం చేసేందుకు ముందుకువచ్చారు. సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కణాంపురం రాజేందర్ మాట్లాడుతూ, మరణంలోనూ మరో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించిన వెంకటి కంటిచూపు ఈ లోకంలో సజీవంగా ఉంటుందన్నారు. నేత్రదాత భార్య మధునమ్మ, కుమారులు, కోడళ్లు లక్ష్మణమూర్తి–వసంత, చంద్రశేఖర్–రమాదేవి, కూతుళ్లు, అల్లుళ్లు చిప్ప సారయ్య–రమాదేవి, వెంగల కుమార్–శారద, మంచికట్ల రమేశ్–అనురాధ, మనవళ్లు, మనమరాళ్లను ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, ప్రతినిధులు రమేశ్, భీష్మాచారి, చంద్రమౌళి, కేఎస్ వాసు, అన్నపూర్ణ, రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధి బెజిగోపాల్ త్రివేది అభినందించారు.

## ఐఎంఈపీఎంఈ సెంటర్‌లో స్వచ్ఛత పక్షోత్సవాలు



చెత్తను తొలగిస్తున్న ఎస్ఎస్ఓ, సిబ్బంది

**కమాన్‌పూర్(రామగిరి):** ఆర్జీ–3 ఏరియాలో చేపడుతున్న స్వచ్ఛత పక్షోత్సవాలను పురస్కరించుకొని శనివారం సెంటనరీకాలనీ ఐఎంఈపీఎంఈ సెంటర్‌లో స్వచ్ఛత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఈపీఎంఈ సెంటర్‌లో ఆర్జీ–3 సీనియర్ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ చెత్తను తొలగించే పనులు చేపట్టారు. డాక్టర్ కళ్యాణచక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంపీఎఫ్ రద్దు చేయండి



జీఎంకు వినతిపత్రం సమర్పించిన నాయకులు

**యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం):** సీఎంపీఎఫ్‌ను పూర్తిగా రద్దు చేయాలని ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి భూనిర్వాసిత అద్దె వాహనాల యజమానులు అండ్ రిటైర్డ్ కార్మికుల పిల్లల సంఘం నాయకులు శనివారం జీఎం మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం డ్రైవర్ జీతం, మెయింటనెన్స్, ఈఎంఐలు, డీజిల్, వాహన విడి భాగాల రేట్లు చాలా పెరగడం వల్ల ఖర్చు పెరిగిందని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం వాహనాలకు ఉన్న 3 ఏళ్ల కాలపరిమితిని ఆరేళ్లకు పెంచాలన్నారు. వచ్చే నెల 5లోపు సమస్యలు పరిష్కరించాలని లేకుంటే జూలై 6 నుంచి అన్ని ఏరియాల భూనిర్వాసిత అద్దె వాహనముల యజమానులు సమ్మెలోకి వెళ్లనున్నట్లు సంఘం నాయకులు నాగరాజు, సురేశ్ తదితరులు తెలిపారు.

## అన్ని సంఘాలను చర్చలకు ఆహ్వానించాలి



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

**గోదావరిఖని(రామగుండం):** సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేవరకు అన్ని కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో నిర్వహించిన యూనియన్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు ఎన్నికలను నిర్వహించలేని పరిస్థితుల్లో యాజమాన్యం ఉందన్నారు. అన్ని కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించి ఐఆర్ దెబ్బతినకుండా చూడాలని కోరారు. జీఎం, కార్పొరేట్ స్థాయి చర్చలకు టీబీజీకేఎస్‌తో పాటు అన్ని జాతీయ సంఘాలను పిలవాలన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డిని సన్మానించారు.

## ఓటమి భయంతోనే ఎన్నికలు వాయిదా



నర్సింహారావు

**గోదావరిఖని(రామగుండం):** ఓటమి భయంతోనే సింగరేణి ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేయించిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ, 2017లో సింగరేణి ఎన్నికలు జరగగా మళ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం వాయిదా వేస్తూ వస్తోందన్నారు. ఎన్నికల ప్రక్రియ తుదిదశకు చేరుకున్న క్రమంలో ఓడిపోతే దాని ప్రభావం కోల్‌బెల్ట్ ప్రాంతంలోని అందరు ఎమ్మెల్యేలపై పడుతుందని, కలెక్టర్లతో లేఖలు రాయించి కోర్టు ద్వారా ఎన్నికలు వాయిదా వేయించారన్నారు. ఎన్నికలు పెట్టని పరిస్థితుల్లో అన్ని యూనియన్లను చర్చలకు ఆహ్వానించాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.